ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

- ఇరుకుగా మారిన రోడ్డుపైనే.. వాహనాల నిలుపుదల
- నవీపేటలో ప్రమాదకరంగా బాసర రహదారి
- ఇటీవల వాహనం కింద పడి విద్యార్థిని మృతి

నవీపేట : మండల కేంద్రంలోని వ్యాపార కూడళ్లకు మధ్యలో ఇరుకైన స్థలంలో విస్తరించుకున్న బాసర రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు వెడల్పుతో ప్రయాణాలకు అనుకూలంగా మారుతుందనుకున్న రహదారి ప్రాణాలను బలిగొంటోంది. అసలే ఇరుకు రోడ్డు..దానికి మధ్యలో డివైడర్ నిర్మించారు. పోటాపోటీగా వ్యాపార సముదాయాలు మరింత ముందుకు దూసుకొచ్చాయి. ఈప్రాంతంలో కొందరు వ్యాపారులు షెడ్డులను నిర్మించుకున్నారు. డివైడర్..షెడ్డు..ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు పడుతుంటే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. ప్రతి శనివారం ఈ రహదారి పక్కనే గల సంత ప్రాంగణంలో మేకల మార్కెట్ జరుగుతుంది. ఈ స్థలం సరిపోకపోవడంతో పక్కనే ఉన్న ఇరుకైన బాసర రహదారిపైనే వ్యాపారులు, వినియోగదారులు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి..


నవీపేటలో ఇరుకు రోడ్డుపై నిలిపిన వాహనాలు

అడ్డదిడ్డంగా పార్కింగ్..

జూన్ 23న నవీపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని తేజస్విని తండ్రి గంగాధర్‌తో కలిసి వెళ్తుండగా.. ఇరుకైన రోడ్డుపై వీరిద్విచక్ర వాహనాన్ని భారీ వాహనం వచ్చి వేగంగా ఢీకొంది. ఈఘటనలో టైర్ల కింద పడి తేజస్విని అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై భగ్గుమన్న యువకులు అధికారులను నిలదీశారు. ఇరువైపులా ఇష్టానుసారం ఏర్పాటు చేసుకున్న షెడ్లను తొలగిస్తామని, అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నాం

మండల కేంద్రంలో నెలకొన్న ఇరుకు రోడ్డు సమస్య కు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీ శ్రీసాయి చైతన్య ఆదేశించారు. జీపీ అధికారులు, రోడ్డు భవనాల శాఖ అధికారుల సహకారంతో చర్యలు చేపడుతాం. అప్పటి వరకు ప్రత్యేకంగా పోలీసును నియమించి వాహనాల పార్కింగ్‌ను అదుపు చేస్తాం.

– వినయ్, ఎస్సై, నవీపేట

నేటి చిత్రం



ప్రమాదకరంగా గుంత

నవీపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లే దారిలో మురుగుకాలువ, సీసీ రోడ్డుకు మధ్యన రోడ్డు అంచున ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. పలువురు ద్విచక్ర వాహనదారులు ఈస్థలంలో ప్రమాదానికి గురయ్యారు. సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నాం.

– డి. సుభాష్‌గౌడ్, నవీపేట

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 బాల్కొండ : 96666 49049 బోధన్ : 99636 95349

క్లుప్తంగా

సమాజసేవ చేయాలి



మోర్తాడ్ : ఏర్గట్ల సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న ఖాజా మొయినుద్దీన్ సోమవారం ఉద్యోగ విరమణ చేయగా అతన్ని విద్యుత్ సంస్థ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ అనంతరం సమాజసేవ చేయాలని ఏఈ సురేశ్ సూచించారు. ఈకార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఏర్గట్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉద్యోగులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేత



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం పేదలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ అధ్యక్షుడు పోల్కం వేణు మాట్లాడారు. పట్టణంలోని బాలుర పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్‌ఆర్మూర్ ఆధ్వర్యంలో 8మంది విద్యార్థినులకు సైకిల్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్ మాట్లాడారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన



వర్ని : సీఐటీయూ, సీపీఎం నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా సోమవారం వర్నిలో సీఐటీయూ, సీపీఎం నాయకులు గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా పోలీసులు సీపీఎం నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అన్యాయమని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నే సాబ్ ఆరోపించారు. సీఐటీయూ నాయకులు సాయి చరణ్, గంగాధర్, సాయిలు, సాయిలు, లక్ష్మణ్, గంగారాం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలపై అవగాహన



బోధన్ : ఎడపల్లి మండలంలోని జాన్కంపేట సీటీసీ ప్రాంగణంలో 12వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరం -2 లో భాగంగా సోమవారం ఎస్‌డీఎస్‌డబ్ల్యూ, జెడీ క్యాడెట్స్‌తో ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరం -2 , జూన్ 27 నుంచి ఈ నెల 6 వరకు నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ, జాన్కంపేట సీటీసీ వైస్ ప్రిన్సిపల్ సయ్యద్ మస్తాన్ ఆలీ పాల్గొని అవగాహన కల్పించారు.క్యాంప్ కమాండెంట్,ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



బోధన్‌టౌన్: పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠకుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. పాఠకులు, సిబ్బందితో మాట్లాడి నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి

బాల్కొండ: రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కొందరు రైతులు యూరియా కొరత ఉందని ఆయనకు విన్నవించారు. ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



వర్ని: మోస్రాలో తులసి స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. శిబిరంలో 94 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 23 మందికి మోతి బిందు ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు గంగాధర్, వీడీసీ చైర్మన్ పోతారెడ్డి, కోశాధికారి స్వామి గౌడ్, లయన్స్ క్లబ్ క్యాంప్ ఇన్‌చార్జి హనుమంత రావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ


మంజూరు పత్రాలు అందిస్తున్న నాయకులు

డొంకేశ్వర్(ఆర్మూర్):మండలంలోని నికాల్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహించారు. ముగ్గు పోసి లబ్ధిదారులకు మంజూరు కాపీలను అందజేశారు. విడతల వారీగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బానోత్ సుమన్ అన్నారు. పంచాయతీ కార్యదర్శి నూనె విఠలాచారి, పస్క ముత్తెన్న, రమేశ్, శివశంకర్, రాము ఉన్నారు.

వరదలు వచ్చే సమయంలో బదిలీలు ఏంటో..

- పోచంపాడ్ డివిజన్–1 ఈఈని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- ఉత్తర్వుల్లో ఇన్‌చార్జి, అదనపు చార్జి ఎవరికివ్వాలో పేర్కొనని వైనం


ఎస్సారెస్పీ కార్యాలయం

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో పోచంపాడ్ డివిజన్–1 ఈఈ చక్రపాణిని బదిలీ చేస్తూ ప్రభుత్వం గత నెల రోజుల క్రితం ఉత్తర్వులను జారీ చేసింది. ఈఈ స్థానంలో ఇన్‌చార్జి లేదా అదనపు చార్జీ లేదా మరో ఉద్యోగి బాధ్యతలు ఇలాంటివి ఏమీ ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. దీంతో ఇక్కడ ఈఈ బదిలీ ప్రక్రియాల్లో భాగంగా ఇప్పటికి రిలీవ్ కాలేదు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదలు వచ్చే సమయంలో ఇవేమి బదిలీలలు అంటూ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్–1 లో ఎస్ఈ తర్వాత రెండోస్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగి ఈఈ ఇన్‌చార్జి కోసం ఉన్నత స్థాయిలో జోరుగా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోస్టులోనే నెలలో సగం రోజులు కూడా విధులకు హాజరుకావడంలేదనే ఆరోపణలున్నాయి.

గోశాల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం గోశాల షెడ్డుకు, రక్షణ గోడ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్డు నిర్మాణానికి విజయ్ టాక్స్ కన్సల్‌టెంట్ కుటుంబసభ్యులు దాతలుగా ముందుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం సిద్ధులగుట్టపై నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వినయ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ యార్డు చైర్మన్ సాయిబాబాగౌడ్, పండిత్‌పవన్, డీసీసీబీ డైరెక్టర్ వాసు, కొంతం మురళీ, సడక్ వినోద్, మల్లయ్య, చిట్టి, భూపేందర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మాలలకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో మాలలకు పెద్దపీట వేయాలని వినయ్‌రెడ్డిని మాల మహానాడు సభ్యులు కోరారు. పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో మాల మహానాడు డివిజన్ కమిటీ సభ్యులు వినయ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు మాదరి రాజన్న, ప్రధానకార్యదర్శి మూగ ప్రభాకర్, కోశాధికారి పులి గంగాధర్, ప్రదీప్, పింజ రవి, కొంతం మురళి, పూర్ణ, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్‌లో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ కలిసి ఆలయ నిర్మాణం కోసం ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నిధులు మంజూరు చేయాలని కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించి రూ. 30 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు వినయ్‌రెడ్డి వెల్మల్ గ్రామస్తులకు నిధులు మంజూరు పత్రాన్ని అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, వెల్మల్ గోపి, గంగాదర్, రాజేందర్, శ్రీధర్, మల్లేష్, కిషన్, రమేష్, ముత్యం, సంతోష్, అనంత్, ప్రశాంత్, భూమేష్, అశోక్, సుబ్బన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని జిరాయత్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు వినయ్‌రెడ్డి భూమి పూజ చేశారు. లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీ అందజేశారు.

బోధన్‌లో వైభవంగా జగన్నాథ రథయాత్ర


బోధన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్ : పట్టణంలో జగన్నాథ రథయాత్ర సోమవారం వైభవంగా జరిగింది. ఆచన్‌పల్లి నుంచి శక్కర్ నగర్‌చౌరస్తా కొత్త బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, పాత బస్టాండ్, రైల్వే గేట్ మీదుగా టీటీడీ కల్యాణం మండపం వరకు కొనసాగింది. అంబేడ్కర్ చౌరస్తా వద్ద శ్రీ జగన్నాథ రథయాత్రకు ఏకచక్రసేవా సమితి ఆధ్వర్యంలో మహహారతి నిర్వహించారు. పట్టణం జగన్నాథ నామస్మరణతో మారుమోగింది. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రముఖులు, స్థానిక నాయకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

లోక కల్యాణార్థం జగన్నాథ యాత్ర

లోక కల్యాణార్థం పట్టణంలో జగన్నాథ రథయాత్ర నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే, మాజీమంత్రి పి. సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్‌లో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) బోధన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథ మహోత్సవంలో ఎమెల్యే పాల్గొని దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల అలివేలు మంగమ్మ మందిరం నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకు జగన్నాథ రథయాత్ర వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోధన్‌లో ఇస్కాన్ మందిరం నిర్మాణానికి 4 ఎకరాల స్థలాన్ని కేటాయించమన్నారు. ఇందుకు కావాల్సిన ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తానని, ఇస్కాన్ బృందం సభ్యులు మందిరం నిర్మాణ ఏర్పాట్లు ప్రారంభించాలని సూచించారు.

పైప్‌లైన్ లీకేజీ.. రోడ్డుపై నిలుస్తోన్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి పోచంపాడ్ కాలనీకి నీటి సరఫరా చేసే పైపులైన్ కాకతీయ కాలువ జీరో పాయింట్ వద్ద లీకేజీవుతోంది. దీంతో నీరంతా వంతెనపై చేరింది. ఆ వంతెన పై నుంచే ప్రాజెక్ట్‌కు, జల విద్యుదుత్పత్తి కేంద్రానికి రోడ్డు ఉంది. దీంతో ఉద్యోగులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరారు.


పైప్‌లైన్ లీకేజీతో వంతెనపై నిలిచిన నీరు

గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి



కమ్మర్‌పల్లి: గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని కమ్మర్‌పల్లి మండల పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సీపీఐఎంల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ ఆఫీసు ఎదుట ఆందోళన నిర్వహించారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, రూ. 5 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులు రామాలయం, అయ్యప్ప ఆలయం, దుర్గామాత, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేపట్టారు. అనంతరం నందీశ్వర మహరాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు ఉన్నారు.

అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

- బోధన్‌లో అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


బోధన్‌లో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్) : నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం బోధన్ మండల అభివృద్ధి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణాలతో పాటు ఇతర అంశాలపై సంబంధిత శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉపాధి కూలీలకు అధిక రోజులు పని కల్పించాలని, డ్వాక్రా గ్రూపు సంఘాలకు ఇన్సూరెన్స్ వర్తించేలా చూడాలని, ఇందిరమ్మ ఇళ్లు కడుతున్న లబ్ధిదారులకు బ్యాంక్ లింకేజీ రుణాలు అందించేలా చూడాలని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల స్టేటస్, పదవ తగతిలో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించడంతో పాటు, రీ ఎన్‌రోల్‌మెంట్ ప్లాన్, నూతన అడ్మిషన్‌ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌అంకిత్, సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ డెలిగెట్ గంగాశంకర్, నాయకులు పాల్గొన్నారు.

నూతన తరగతి గది ప్రారంభం

బోధన్‌రూరల్ : మండలంలోని భవానీపేట్‌లో 21 ఏళ్లుగా మూతబడి ఉన్న ప్రాథమిక పాఠశాలను ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో పునఃప్రారంభం చేశారు. ఈ పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన నూతన తరగతి గదిని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి..

నవీపేట : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్థానిక యువకులు బాసర రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విన్నవించారు. రోడ్డు ఇరుకుగా మారడంతో ఇటీవల ఇంటర్ విద్యార్థిని తేజస్విని టిప్పర్ కింద పడి మృతి చెందినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తొలగింపునకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విద్యార్థి ప్రణయ్‌కు అభినందన



బోధన్: పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన కారం స్వామి, లత దంపతుల కుమారుడు ప్రణయ్ సాయి జాతీయస్థాయిలో నిర్వహించిన ఐఐటీ అర్హత పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటి సీటు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్మూర్‌టౌన్ : వర్షకాలం కావడంతో ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోని సీజనల్ వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని 19వ, 34వ వార్డులో పారిశుధ్య కార్యక్రమం, ఘన వ్యర్థ పదార్థల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యాక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, వార్డు అధికారులు మహేష్, వీణ, జవాన్లు శంకర్, భాజన్న, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి


ప్రచారం చేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం. నరేందర్ అన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ జూలై 2న చలో ఆర్డీవో ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈమేరకు పట్టణంలోని ఓ కళాశాలలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

బోధన్: కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా జిల్లాకు వచ్చిన సందర్భంగా ముందస్తు అక్రమ అరెస్టులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వామపక్ష పార్టీల నాయకులు నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర మంత్రులెవరైన జిల్లా వస్తే తమ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసీ, సీపీఎం,అనుబంధ ప్రజా సంఘాల డివిజన్ ప్రతినిధులు మల్లేష్, వరదయ్య, శంకర్‌గౌడ్, పడాల శంకర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

